ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ...

## అన్ని చర్యలు తీసుకోవాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

2



18వ వసంతంలోకి...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

## ఎన్టీఆర్ - కృష్ణా

గురువారం 30 జనవరి 2025

పేజీలు 8



రైల్వే ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల డీపీఆర్‌లను

# సిద్ధం చేయండి

- ప్రజాప్రయోజనాల దృష్ట్యా సమష్టి కృషితో పనులు పూర్తిచేద్దాం
- దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అంశాలకూ ప్రాధాన్యత
- విజయవాడను రైల్వే హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి
- జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జనవరి 29, మేజర్ న్యూస్** : ప్రజల విస్తృత ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచు కొని రైల్వేతో ముడిపడిన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను సమష్టి భాగస్వామ్యంతో సత్వరం పూర్తిచేసేందుకు అవసరమైన డీపీఆర్‌లను త్వరితగతిన సిద్ధం చేయాలని, ఇప్పటికే చేపట్టిన పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. డివిజనల్ రైల్వే మేనేజర్

2లో



కలంకారి క్లస్టర్ ఏర్పాటు చర్యలు

## వేగవంతం చేయండి

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**పెడన, మేజర్ న్యూస్** : ఎంఎస్‌ఎంఈలు భాగంగా కలంకారి క్లస్టర్ ఏర్పాటుకు రెవిన్యూ, టూరిజం చేనేత జౌళి మున్సిపల్ ఆధీనంలో ఉన్న స్థలాలను గుర్తించి ఎం ఎస్ ఎం ఈ కి బదిలీకి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్లో రెవెన్యూ, పరిశ్రమలు, చేనేత, పెడన మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి పెడనలో కలంకారి క్లస్టర్ ఏర్పాటు, అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలో భాగంగా పెడనలో మిగతా 2లో...

రోజా, అమర్నాథ్, అంబటి లాంటివారు కూడా పెట్టుబడులపై మాట్లాడడం

# హాస్యాస్పదం

- పెట్టుబడుల గురించి మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదు
- వేల కోట్ల ఆదాయం కల్పించే అమర రాజా బ్యాటరీస్‌పై కక్ష సాధింపు చర్యలకు దిగారు
- కూటమి అధికారంలోకి రాగానే విశాఖ కేంద్రంగా ప్రధాని రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు
- సంక్షేమం, అభివృద్ధి అజెండాగా ముందుకు వెళ్తున్నాం
- జగన్ అండ్ కో ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోలేరన్న మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం మేజర్ న్యూస్** : ఐదేళ్ల పాలనలో పైసా పెట్టుబడి తీసుకురాకపోగా, ఉన్న పరిశ్రమల్ని తరిమికొట్టిన జగన్ రెడ్డి అండ్ కో పెట్టుబడుల గురించి, ముఖ్యమంత్రి దావోస్ పర్యటన గురించి మాట్లాడడం హాస్యాస్పదమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మిగతా 2లో

## ఏసీబీ వలలో..

## తహసీల్దార్, వీఆర్వో

రూ.30వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ పట్టుబడిన తహసీల్దార్ జాహ్నవి, వీఆర్వో రామారావు



కంచికచర్ల జనవరి 29 మేజర్ న్యూస్ : పొలం అడంగల్ తప్పు ఉండటం వలన సరి చేయడం కోసం పరిటాలకి చెందిన కౌలు రైతు మాగంటి కోటేశ్వరరావు దగ్గర లక్షా రూపాయలు డిమాండ్ చేయగా 30 వేల రూపాయలకు పాసు పుస్తకాలు జారీ బేరం కుదుర్చుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ కిశోర్ బాబు తెలిపారు. 30 వేలు రూపాయలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని కిశోర్ బాబు అన్నారు. ఇంక నువ్వు విచారణ జరుగుతూనే ఉంది.

(మొదటిపేజీ తరువాయి)



ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా

## అన్ని చర్యలు తీసుకోవాలి

**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై పలు సూచనలు చేశారు.ఇంటర్మీడియట్ థియరి ఎగ్జామ్స్ మార్చి 1వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని, 20వ తేదీ వరకు జరుగుతాయని, పరీక్షా సమయాలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ/ఎయిడెడ్ /సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలు 55, ప్రైవేట్ జూనియర్ కళాశాలు 114, మొత్తం 169 కళాశాలలు ఉన్నాయని అన్నారు. జనరల్, ఒకేషనల్ కోర్సులలో మొత్తం మొదటి సంవత్సరం 24,557 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం 20,873 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు జిల్లాలో 63 థియరీ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు.ప్రశ్నాపత్రాలు లీకేజీ కాకుండా తగిన భద్రతతో డిస్ట్రిక్ట్ స్ట్రాంగ్ రూములో భద్రపరచాలని, అక్కడ నుంచి వివిధ పోలీస్ స్టేషన్లకు, అక్కడినుండి పరీక్షా కేంద్రాలకు తరలించినప్పుడు తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలు ఏరోజుకారోజు జవాబు పత్రాలు, కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ డిస్పాచ్ చేయుటకు పోస్ట్ ఆఫీస్ లలో తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రూరల్ ప్రాంతాల నుండి పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుటకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని ప్రజా రవాణా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణ మానిటరింగ్ చేయాలన్నారు.జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ కొన్ని చోట్ల కాంపౌండ్ వాల్ తక్కువ ఎత్తు ఉన్న చోట్ల జంప్ చేసి వచ్చే అవకాశం గలచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలు పోలీస్ సిబ్బంది విజిట్ చేసి ఇలాంటి ప్రదేశాలు గుర్తించాలన్నారు. డిఆర్వో కె చంద్రశేఖరరావు, ఆర్ ఐ ఓ పిబి సాల్మన్ రాజు, జిల్లా పరీక్షల కమిటీ ప్రత్యేక అధికారి ప్రసాద్ శాస్త్రి, సభ్యులు ఎన్‌వి.నరసింహారావు, పి.నాగరవి, జి.వెంకటరమణ సమావేశంలో హాజరు కాగా, డీఈవో పివిజే రామారావు డి పి టి ఓ వాణిశ్రీ, డిఎం అండ్ హెచ్ వో డాక్టర్ ఎస్ శర్మిష్ట వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

కలంకారి క్లస్టర్ ఏర్పాటు చర్యలు

## వేగవంతం చేయండి

కలంకారి క్లస్టర్ ఏర్పాటుకు రెవెన్యూ, టూరిజం, చేనేత జౌళి, మున్సిపల్ అధీనంలో ఉండి గుర్తించిన స్థలాలు ఎంఎస్ఎమ్ఈ కి బదిలీకి చర్యలు



తీసుకోవాలన్నారు. క్లస్టర్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలన్నారు. నియోజవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఈ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ పెడనలో కలంకారీ క్లస్టర్ పనులు వేగంగా జరిగేలా చూడాలని, తద్వారా కార్మికుల ఉపాధికి కృషి చేయాలని అన్నారు. నియోజకవర్గంలో 15 వేల మంది పైగా కలంకారీ పరిశ్రమపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ క్లస్టర్ ద్వారా కలంకారీని ఆధునికరించి డిజైన్ డెవలప్మెంట్, బ్లాక్ మేకింగ్, కలంకారిలో వాడే రా మెటీరియల్ బ్యాంక్ ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవడం ద్వారా తక్కువ ధరలకే రా మెటీరియల్ దొరకటానికి వీలవుతుందన్నారు. తద్వారా కార్మికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు, ఈ కార్యక్రమంలో క్లస్టర్ డెవలప్మెంట్ ప్రెసిడెంట్ బి. ప్రసాద్,కార్యదర్శి జంపాన శ్రీను, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, బందర్ ఆర్ డి ఓ కే. స్వాతి, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం. ఆర్ వెంకట్రావు, పెడన మున్సిపల్ కమిషనర్ ఎం. గోపాల్ రావు, పెడన తాసిల్దార్ కూనపు రెడ్డి అనిల్ కుమార్,జిల్లా టూరిజం అధికారి రామ్ లక్ష్మణ్, పాల్గొన్నారు.

# రైల్వే ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల డీపీఆర్‌లను సిద్ధం చేయండి

(మొదటిపేజీ తరువాయి)



(డీఆర్ఎం) నరేంద్ర ఎ.పాటిల్ దృష్టికి తీసుకొచ్చారు. రైల్వేతో ముడిపడిన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు బుధవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ అధ్యక్షతన డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర.. దక్షిణ మధ్య రైల్వే అధికారులు, రెవెన్యూ, మునిసిపల్, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. రైల్వేతో ముడిపడిన ఇంజనీరింగ్, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, ఎస్టేట్ సెక్షన్ల అంశాలపై సమావేశం దృష్టిసారించింది. విజయవాడను ఇబ్బందిపెట్టిన వరదలు పునరావృతం కాకుండా రైల్వే భాగస్వామ్యంతో చేపట్టాల్సిన పనులు నిరాటంకంగా కొనసాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. డ్రెయిన్లలో పూడికతీత, పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు మ్యాన్‌హోళ్ల వద్ద తేలియాడే చెత్తాచెదారం తొలగింపు, సీసీ అప్రూవ్, ఆర్‌వోబీ/ఆర్‌యూబీల మంజూరు, నిర్మాణం, ఆక్రమణల తొలగింపు, డీపీఆర్‌ల తయారీపై కూలంకషంగా చర్చించి, తక్షణ కార్యాచరణకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు.

సమావేశంలో పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ మాటాడుతూ రైల్వే ప్రాజెక్టులు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థల అభివృద్ధి పనులకు సంబంధించిన డీపీఆర్‌లను వెంటనే సిద్ధం చేసి, అనుమతులు సాధించేలా కృషిచేయాల్సిన అవసరముందన్నారు. రైల్వే ప్రాజెక్టులు, శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థ, బుల్లెట్ ట్రైన్, మెట్రో లైన్ నిర్మాణం వంటి వాటిని కేంద్రం దృష్టికి తీసుకొచ్చి అనుమతులు, నిధులు మంజూరుకు తనవంతు కృషిచేసి, విజయవాడ నగరాన్ని రైల్వే హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని వెల్లడించారు. గుణదల వద్ద రోజుకు 180సార్లు గేటు పడుతుండటంతో ప్రజలుతీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని.. ఈ నేపథ్యంలో యుద్ధప్రాతి పదికన వంతెన పనుల పూర్తికి కృషిచేయాల్సిన అవసరముందన్నారు. గుణదల రైల్వే వంతెనకు సంబంధించిన డీపీఆర్‌ను రైల్వే బోర్డుకు సమర్పించడం జరిగిందని, వీలైనంత త్వరలో అనుమతుల మంజూరుకు కృషిచేస్తామని ఎంపీ శివనాథ్ తెలిపారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలు వల్ల విజయవాడ నగర ప్రజలు ముంపుబారిన పడి ఆర్థికంగా కోట్లాది రూపాయలు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. బుడమేరు ఆధునికీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న తరుణంలో వాటికి అనుగుణంగా రైల్వేకు సంబంధించిన అండర్ పాస్‌లు, ఓవర్ బ్రిడ్జ్‌లు, డ్రెయిన్లను అభివృద్ధి చేసేందుకు రైల్వే అధికారులు ప్రణాళికలు రూపొందించి చర్యలు తీసుకోవాలన్నారు. వాంబే కాలనీ ఆర్‌వోబీ నిర్మాణంతో పాటు సింగ్ నగర్ – రామకృష్ణాపురం అదనపు వెంట్ ఏర్పాటు పైనా దృష్టిపెట్టాలన్నారు. పశ్చిమలో వన్‌టౌన్ ట్రాఫిక్ కష్టాలను తొలగించడంతో పాటు సితార, చర్చి, శివాలయం వద్ద సర్కిళ్ల అభివృద్ధికీ చొరవచూపాల్సిన అవసరముందని శివనాథ్ తెలిపారు.

కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, బుడమేరు ఆధునికీకరణతో పాటు విజయవాడ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టడం జరిగిందని.. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా నిర్మాణాలకు అనువైన వేసవిలో వివిధ అభివృద్ధి పనుల పూర్తికి స్పష్టమైన కార్యాచరణతో, సమన్వయంతో ముందుకెళ్లాల్సిన అవసరముందన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, రైల్వే అధికారుల సమన్వయంతో ప్రజావసరాలను తీర్చే ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి పనులు పూర్తిచేసేందుకు కృషిచేస్తామన్నారు. అవసరం మేరకు త్వరితగతిన జాయింట్ ఇన్‌స్పెక్షన్లు నిర్వహించనున్నామని తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థకు రైల్వేశాఖ చెల్లించాల్సిన బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తద్వారా నగరాభివృద్ధికి మరిన్ని నిధులు సమకూరుతాయన్నారు.

**సమన్వయ సమావేశాలతో మెరుగైన ఫలితాలు:** డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి రైల్వే ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టిసారించారని, పెద్దఎత్తున ప్రణాళికలతో ముందుకెళ్తున్నారని, ఈ నేపథ్యంలో విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో పనుల పూర్తికి ఇలాంటి సమన్వయ సమావేశాలతో మెరుగైన ఫలితాలు ఉంటాయని డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ అన్నారు. వచ్చే రెండేళ్ల సమయం చాలా కీలకమైందని, సమష్టి కృషితో పనుల సత్వర పూర్తితో రాష్ట్ర అభివృద్ధికి కృషిచేద్దామన్నారు. భద్రత దృష్ట్యా రైల్వే వంతెనల నిర్వహణ అత్యంత కీలకమైందని.. ఈ వంతెనల వద్ద చేపట్టే డ్రెయిన్లలో పూడికతీత వంటి పనులను వివిధ శాఖల సమన్వయంతో జాగ్రత్తగా చేపట్టేందుకు కృషిచేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (సమన్వయం) ఎస్.వరుణ్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రోజా, అమర్నాథ్, అంబటి లాంటివారు కూడా పెట్టుబడులపై మాట్లాడడం హాస్యాస్పదం

(మొదటిపేజీ తరువాయి)

విభజిత రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చే ప్రయత్నంలో భాగంగా నాడు చంద్రబాబు కాళ్లకు చక్రాలు కట్టుకుని తిరిగి పెట్టుబడులు తీసుకొచ్చారు. విశాఖ కేంద్రంగా మూడు సార్లు పెట్టుబడిదారుల సదస్సులు నిర్వహించారు. అదానీ డేటా సెంటర్, లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ లాంటి ప్రఖ్యాత కంపెనీలను రాష్ట్రానికి రప్పించారు. వాటిని జగన్ రెడ్డి కుట్రపూరితంగా తరిమేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాజకీయ కుట్రతో.రాష్ట్రానికి వేల కోట్ల ఆదాయం సమకూర్చే అమరరాజా బ్యాటరీస్‌ను తరిమేస్తే తెలంగాణలో రూ.9 వేల కోట్ల పెట్టుబడి పెట్టడం వాస్తవం కాదా అని నిలదీశారు. చంద్రబాబు కష్టంతో కియా కార్ల పరిశ్రమ అనంతపురంలో ఏర్పాటు చేశారు. కానీ అనుబంధ సంస్థల్ని తరిమేస్తే తెలంగాణ, కర్ణాటకలోఏర్పాటు చేసుకున్నారని తెలిపారు.

**పెట్టుబడుల్ని తరిమినోళ్లు పెట్టుబడి గురించి మాట్లాడడమా?**

ఏపీఐఐసీ ఛైర్మన్ గా, పర్యాటక శాఖ మంత్రిగా పని చేసిన రోజా ఎప్పుడు ఎక్కడ ఎలా కమిషన్లు దండుకోవాలా అని ఆలోచించారే తప్ప.. ఏ రోజైనా ఒక్క పరిశ్రమ అయినా తెచ్చారా? పర్యాటక రంగ అభివృద్ధికి ఒక్కరోజైనా చర్యలు తీసుకున్నారా? కోడి గుడ్డు పెట్టింది, పొదగాలి అని మాట్లాడే అమర్నాథ్ కూడా పెట్టుబడుల గురించి మాట్లాడుతున్నారు.దావోస్‌లో చలిగా ఉంది, జలుబు చేస్తుంది, జ్వరం వస్తుందని డ్రామాలాడారు. అలాంటి వారికి పెట్టుబడుల గురించి ప్రశ్నించే అర్హత ఉందా అని మంత్రి కొల్లు రవీంద్ర నిలదీశారు. గత ఐదు సంవత్సరాల్లో ఒక్క పెట్టుబడి సదస్సుకు హాజరవలేదు, అయిన వాటి వివరాలు కూడా బయటపెట్టలేదు. కానీ నేడు పెట్టుబడులకు సంబంధించి ఎప్పుడు ఏ సంస్థతో చర్చించామనే వివరాలన్న ప్రజలకు స్పష్టంగా చెబుతున్నాం. అయినా జగన్ రెడ్డి లండన్‌లో కూర్చుని ఏపీలో కుళ్లు రాజకీయాలకు పాల్పడడం సిగ్గుచేటు అని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. నాడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్.. నేడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసేందుకు జగన్ రెడ్డి కుట్రలు చేశారు. అయినా,చంద్రబాబుపై నమ్మకంతో పెట్టుబడిదారులు ముందుకొచ్చారు. విశాఖ కేంద్రంగా ప్రధాన మంత్రి రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు శంకుస్థాపన చేశారు. రూ.1.85 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు, పాయకరావుపేటలో బల్క్ డ్రగ్ పార్కు, రైల్వే ప్రాజెక్టులు, రైల్వే జోన్, నెల్లూరులో ఇండస్ట్రియల్ పార్కులకు, ఆర్సెస్ మిట్టల్ కంపెనీని జూమ్ కాల్‌తో ఒప్పించారు. టీసీఎస్, బీపీసీఎల్, రిలయన్స్, గ్రీన్ కో, పీపుల్ టెక్ లాంటి కంపెనీలతో ఎంవోయూలు జరిగాయి. గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ నినాదంతో పెట్టుబడుల్ని ఆకర్షించిన చంద్రబాబు.. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో పెట్టుబడిదారుల్ని ఆకర్షిస్తున్నాం. పెట్టుబడి పెట్టేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.ఎన్నికల హామీ మేరకు సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తాం.సంక్షేమ కార్యక్రమాలకు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నాం. అధికారంలోకి రాగానే పెన్షన్ మొత్తాన్ని ఏకంగా రూ.4 వేలకు పెంచాం. ఏటా రూ.33 వేల కోట్లు పెన్షన్ల రూపంలో అందిస్తున్నాం. జూన్ నుండి తల్లికి వందనం ప్రారంభిస్తున్నాం. ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ బిల్లులు జగన్ రెడ్డి ఎగ్గొడితే వాటిని అధికారంలోకి రాగానే క్లియర్ చేశాం. రూ.25 లక్షల వరకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా సాయం అందిస్తున్నాం. జూనియర్ కాలేజీల్లో జగన్ రెడ్డి నిలిపివేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని పున:ప్రారంభించాం. గ్యాస్ సిలిండర్లు అమలు చేస్తున్నం, తల్లికి వందనం జూన్ నుండి ప్రారంభించబోతున్నాం. ఇప్పటికే 100 అన్న క్యాంటీన్లు ప్రారంభించాం. త్వరలోనే అన్నదాత పథకం కింద రైతులకు ఆర్థిక సాయం అందించేందుకు మార్గదర్శకాలు రూపొందించాం. ఉపాధి కల్పనకు వీలుగా విద్యా విధానం మార్చాలని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శ్రమిస్తున్నారు. దేశానికి మార్గదర్శకంగా ఏపీ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దేలా ప్రణాళికలు రచిస్తున్నాం. జగన్ రెడ్డి ఐదేళ్లలో చేయలేని పనుల్ని ఆరు నెలల్లోనే చేసి చూపిస్తున్నాం.ఆరు నెలల్లోనే 70 శాతానికి పైగా రోడ్లన్నీ బాగు చేశాం. కొత్త రోడ్లను వేశాం. వచ్చే ఆరు నెలల్లో గుంతలు లేని రోడ్లను సాకారం చేస్తాం. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుండి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. దాన్ని చూసి ఓర్వలేకనే దిక్కుమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారు.జగన్ రెడ్డి అండ్ కో ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడం సాధ్యం కాదని గుర్తుంచుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

**తెలుగువారికి పద్మ అవారులు హర్షణీయం :**

పద్మ అవార్డుల్లో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వడంపై మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఉప రాష్ట్రపతి నందమూరి బాలకృష్ణ, దువ్వూరు నాగేశ్వర్ రెడ్డి, మందకృష్ణ మాదిగ, కె.ఎల్.కృష్ణ, మాడుగుల నాగ ఫణి శర్మ లాంటి వారికి పద్మ అవార్డులు ప్రకటించినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి, ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

# ఫిబ్రవరి 2న బీఎన్ఐ నెట్వర్కింగ్ కాన్క్లేవ్ 3.0

**వ్యాపార విస్తరణతో పాటు, నూతన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అద్భుత అవకాశం**

**ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న లెజెండరీ క్రికెటర్ జాంటీ రోడ్స్ కీనోట్ స్పీచ్**

**సదస్సులో పాల్గొననున్న 1500 మందికి పైగా వ్యాపారవేత్తలు**

**వ్యాపార సంస్థల అధినేతల రౌండ్ టేబుల్ సమావేశాలు**

**బీఎన్ఐ విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జై దేశాయ్, విశాల్ దేశాయ్**



**విజయవాడ మేజర్ న్యూస్ :** వ్యాపారులందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి, పరస్పర వాణిజ్య ప్రయోజనాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా బీఎన్ఐ నెట్వర్కింగ్ కాన్క్లేవ్ 3.0 నిర్వహిస్తున్నట్లు బీఎన్ఐ విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జై దేశాయ్, విశాల్ దేశాయ్ తెలిపారు. నగరంలో ఓ హోటల్లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. లబ్బీపేట జీఆర్టీ గ్రాండ్ హోటల్లో ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం నాడు కాన్క్లేవ్ జరుగుతుందని వెల్లడించారు. వ్యాపార విస్తరణతో పాటు, నూతన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ సదస్సు అద్భుత అవకాశమని పేర్కొన్నారు. లెజెండరీ క్రికెటర్ జాంటీ రోడ్స్ కీనోట్ స్పీచ్ ఈ సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అన్నారు. గ్లోబల్ స్థాయిలో అవకాశాలను సృష్టించుకునేలా వ్యాపారవేత్తల్లో స్ఫూర్తినింపేలా జాంటీ రోడ్స్ ప్రసంగం ఉంటుందని, అద్వితీయమైన ఫీల్డింగ్ నైపుణ్యంతో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించుకున్న జాంటీ రోడ్స్ బీఎన్ఐ నెట్వర్కింగ్ కాన్క్లేవ్ 3.0లో పాల్గొననుండటం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోతుందని అన్నారు. ఈ సదస్సులో 1500 మందికి పైగా ప్రముఖ వ్యాపారవేత్తలు హాజరవుతారని ప్రకటించారు. సదస్సులో భాగంగా వాణిజ్య సంస్థల అధినేతలతో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని, 8 గంటల పాటు జరిగే నెట్వర్కింగ్ కాన్క్లేవ్ నూతన వాణిజ్య అవకాశాల సృష్టికి, వ్యాపార వృద్ధికి అద్భుత వేదికగా నిలుస్తుందని చెప్పారు. సదస్సు అనంతరం కూడా, వ్యాపారవేత్తల మధ్య సంబంధాలు కొనసాగేలా అత్యాధునిక సాంకేతిక వ్యవస్థతో అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. పరస్పర వాణిజ్య అవకాశాల అభివృద్ధికి బీఎన్ఐ వారధిగా కృషి చేస్తుందని జై దేశాయ్, విశాల్ దేశాయ్ పేర్కొన్నారు. ఈ అద్భుతమైన అవకాశాన్ని వ్యాపారవేత్తలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. బీఎన్ఐ నెట్వర్కింగ్ కాన్క్లేవ్ 3.0 బ్రోచర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీఎన్ఐ నెట్వర్కింగ్ కాన్క్లేవ్ 3.0 చైర్మన్ మేఘన ఆచంట, మెంటార్ నండూరి త్రినాథ్, కన్వీనర్ పి. యువ కిషోర్, ట్రెజరర్ మద్దినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శక్తి పంప్స్ లిమిటెడ్ క్యూ 3, 9ఎం ఎఫ్ వై25లో అద్భుతమైన పనితీరును కొనసాగిస్తోంది



**విజయవాడ, మేజర్ న్యూస్ :** శక్తి పంప్స్ (ఇండియా) లిమిటెడ్ (ఎస్పిఐఎల్), డిసెంబర్ 31, 2024తో ముగిసిన త్రైమాసికం, తొమ్మిది నెలల ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. శక్తి పంప్స్ (ఇండియా) లిమిటెడ్ చైర్మన్ దినేష్ పాటిదార్, కంపెనీ పనితీరుపై ఇలా వ్యాఖ్యానించారు, "మా కంపెనీ ప్రతిష్టాత్మకమైన "గ్రేట్ ప్లేస్ టు వర్క్" సర్టిఫికేషన్ను సంపాదించిందని పంచుకోవడానికి నేను సంతోషంగా ఉన్నాను, ఇది మా బలమైన, ప్రేరేపిత బృందానికి నిదర్శనం, ఇది కంపెనీ స్థిరమైన వృద్ధికి దోహదపడింది. ఆర్డర్ల అమలు, కార్యాచరణ సామర్థ్యాల పెరుగుదల ద్వారా కంపెనీ బలమైన మొత్తం ఆర్థిక పనితీరును అందించింది, దీని ఫలితంగా గణనీయమైన మార్జిన్ విస్తరణ కూడా జరిగింది. ఆర్డర్ ఇన్ఫ్లో ఊపందుకుంది, ఫలితంగా దాదాపు రూ. డిసెంబర్ 31, 2024 నాటికి 20,700 మిలియన్ల (జీఎస్టీతో సహా) చెల్లించాల్సి ఉంది, ఇది ఒక సంవత్సరంలోపు పూర్తి చేయాలి. ఈ త్రైమాసికంలో, కంపెనీ మహారాష్ట్రలోని మాగెల్ త్యాలా సౌర్ కృషి పంప్ పథకం కింద రూ. 7,543 మిలియన్ల (జీఎస్టీతో సహా) విలువైన 25,000 పంపుల లెటర్ ఆఫ్ ఎంప్యానెల్మెంట్ను అందుకుంది, హర్యానా పునరుత్పాదక ఇంధన శాఖ నుండి రూ. 1,163.6 మిలియన్ల (జీఎస్టీతో సహా) విలువైన 3,174 పంపుల ఆర్డర్ను అందుకుంది. మాగెల్ త్యాలా సౌర్ కృషి పంప్ పథకం వంటి పిఎం కుసుమ్ పథకం వెలుపల ఆర్డర్ల వైవిధ్యంతో, మేము మా వృద్ధి అవకాశాల గురించి నమ్మకంగా ఉన్నాము. రూ. 750 బిలియన్ల పెట్టుబడి వ్యయంతో మద్దతు ఇవ్వబడిన పిఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజిలి యోజన" వంటి ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా బలోపేతం చేయబడిన సౌర పైకప్పు ఒక ఆశాజనక అవకాశాన్ని అందిస్తుంది. రైతుల శ్రేయస్సు కోసం, అలాగే వారి స్థిరత్వ లక్ష్యాలను చేరుకోవడానికి, పునరుత్పాదక ఇంధన పరిష్కారాలను వ్యవసాయంతో అనుసంధానించడంపై ప్రభుత్వం దృష్టి సారించడంతో గణనీయమైన అవకాశాలను మేము అంచనా వేస్తున్నాము. ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఎలక్ట్రిక్ మోటార్లు, కంట్రోలర్ల తయారీలోకి ప్రవేశించడం ద్వారా మేము వ్యూహాత్మకంగా మా వ్యాపార నమూనాను వైవిధ్యపరిచాము. ఈవి రంగంలో, మేము ఓఈఎంల నుండి పైలట్ ఆర్డర్లతో పురోగమిస్తున్నాము, ఇది భవిష్యత్తులో మాకు ఒక ముఖ్యమైన అవకాశాన్ని అన్లాక్ చేయవచ్చు. మా ఎగుమతి వ్యాపారం కూడా బలమైన పనితీరును అందించింది, ఇది 9ఎంఎఫ్ వై25లో 58% వైవైపెరిగి రూ. 3,119 మిలియన్లకు చేరుకుంది.

## సైబర్ మోసాలపై అవగాహన కలిగించాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** లోన్ యాప్ సైబర్ మోసాలపై ప్రజలలో అవగాహన కలిగించాలని శాంతి భద్రత పరిరక్షణ, మహిళల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు సూచించారు. బుధవారం వార్షిక తనిఖీలలో భాగంగా అవనిగడ్డ పోలీస్ స్టేషన్ను ఎస్పీ తనిఖీ నిర్వహించారు. అవనిగడ్డ డి.ఎస్.పి విద్యాశ్రీ. సిఐ యువకుమార్. ఎస్ ఐ శ్రీనివాసులు స్వాగతం పలుకగా పోలీస్ స్టేషన్ లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పనితీరును తనిఖీ చేసి రిసెప్షన్ కౌంటర్ తో పాటు రైటర్ రూము రికార్డులను, సీసీ కెమెరాల నిర్వహణను, కంప్యూటర్లో నిక్షిప్తమైన సమాచారాన్ని పరిశీలించారు .మహిళాసంరక్షణ సైబర్ క్రైమ్ నియంత్రణకు చేపట్టిన సంస్కరణలు కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా జవాబుదారితనంతో కూడిన సేవలు అందిస్తున్నట్లు ఎస్పి గంగాధర్ రావు చెప్పారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎనలేనిదని ప్రస్తుతం అవనిగడ్డ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సీసీ కెమెరాలే కాకుండా మరికొన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

## బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆర్థిక సాయం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఇటీవల మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక మూడు,ఏడు వార్డులలోని భవన నిర్మాణ కార్మికులు 10 రోజుల వ్యవధిలో ఇరువురు మృతి చెందారు. జనవరి నెల 9వ తేదీన మూడవ వార్డుకు చెందిన బండారు పాములు. ఏడవ వార్డుకు చెందిన రామిశెట్టి శ్రీనివాసరావు 19వ తేదీన మరణించగా ఇరువురి కుటుంబాలను బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి 8000 రూపాయల చొప్పున 16,000 రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల భవన నిర్మాణం వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అన్నపరెడ్డి నాగేశ్వరరావు. జిల్లా నాయకులు యాసం శ్రీనివాసరావు. మాదాసు కుమార్. శీలం చిన్నోడు తో పాటు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు,

## దిఖోగే తో బికోగే ప్రచారాన్ని ప్రారంభించిన అమెజాన్ ఇండియా

**గుంటూరు మేజర్ న్యూస్ :** డిజిటల్ మార్కెట్ప్లేస్లలో అమ్మకాల కోసం చిన్న వ్యాపారాలకు అవగాహన కల్పించేందుకు అమెజాన్ ఇండియా ఒక కొత్త బ్రాండ్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ ప్రచారంలో మూడు సృజనాత్మక, హాస్యభరితమైన వాణిజ్య ప్రకటనలు ఉన్నాయి. దిఖోగే తో బికోగే పేరుతో రూపుదిద్దుకున్న ఈ ప్రచార కార్యక్రమం విక్రేతలు తమ ఉత్పత్తులను ప్రోత్సహించడానికి, విక్రయించడానికి అసాధారణ మార్గాలను తీసుకునే విభిన్న దృశ్యాన్ని చూపుతుంది. వీటిలో విస్తృత కస్టమర్ బేస్, భారతదేశంలోని 100 శాతం సర్వీస్ చేయగల పిన్ కోడ్లకు చేరుకోగల అవకాశం, 18కి పైగా గ్లోబల్ మార్కెట్ప్లేస్లకు అవకాశాలు ఉంటాయి. ఆన్లైన్ అమ్మకాలను అందుబాటులోకి తీసుకురావడం, ప్రభావవంతంగా చేయడం ద్వారా అన్ని పరిమాణాల వ్యాపారాలను శక్తివంతం చేయడంలో అమెజాన్ నిబద్ధతను ఈ ప్రచారం నొక్కి చెబుతుంది.

## గోద్రేజ్ ఆగ్రోవెట్ నుంచి ఆర్గో రిడ్ ఫిష్ లైస్ నియంత్రకం



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఆర్గో రిడ్ పేరిట ఫిష్ లైస్ నియంత్రకాన్ని విడుదల చేసినట్లు గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ వెల్లడించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ సహకారంతో అభివృద్ధి చేయబడిన ఈ ఉత్పత్తి, చేపలపై పరాన్నజీవి చేరటం (ఆర్గులస్ స్పాట్) కారణంగా ఏర్పడే గాయాలను నయం చేయడంలో సహాయపడుతుంది. తద్వారా, చేపల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఆక్వా రైతులు తమ చేపల ఆరోగ్యాన్ని బాగా చూసుకోవడానికి ఈ ఉత్పత్తి సహాయపడుతుంది. ఈ ఆవిష్కరణ గురించి గోద్రేజ్ ఆగ్రోవెట్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్ సింగ్ యాదవ్ మాట్లాడుతూ, నీలి విప్లవానికి దోహదపడాలనే తపనలో, పరిశ్రమ యొక్క అతిపెద్ద సవాళ్లలో ఒకదాన్ని ఎదుర్కోవడానికి నమ్మకమైన, ఉపయోగించడానికి సులభమైన, ప్రభావవంతమైన సాధనంగా ఆర్గో రిడ్ ఉపయోగపడుతుందన్నారు. చేపల పెంపకందారులను శక్తివంతం చేయడానికి ఈ ఉత్పత్తి తోడ్పడుతుందని పేర్కొన్నారు.

## ఎంబైబ్ ఏఐ పవర్డ్ లెర్నింగ్ ప్లాట్ఫామ్ను ఇంటిగ్రేట్ చేసిన సామ్సంగ్




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశ అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్సంగ్, ఏఐ ఆధారిత వ్యక్తిగతీకరించిన అభ్యాస ఫలితాల వేదిక అయిన ఎంబైబ్ తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీనిని టీవీ కోసం రూపొందించిన విద్యా యాప్ అయిన సామ్సంగ్ ఎడ్యుకేషన్ హబ్యాప్లో అనుసంధానించింది. ఈ భాగస్వామ్యం టీవీలు విద్యార్థులకు వ్యక్తిగతీకరించిన అభ్యాస అనుభవాలను అందించే ప్రభావవంతమైన విద్యా సాధనాలుగా మారడానికి సహాయపడుతుంది. ఈ భాగస్వామ్యం ద్వారా సామ్సంగ్ ఎడ్యుకేషన్ హబ్ యాప్లో భాగంగా సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, కేంబ్రిడ్జ్, అన్ని రాష్ట్ర బోర్డులు, ఐఐటీ జేఈఈ, నీట్ వంటి ప్రధాన ప్రవేశ పరీక్షలతో సహ అన్ని ప్రధాన పాఠ్యాంశాలకు మద్దతు ఇస్తూ విస్తృతమైన విద్యా కవరేజీని ఎంబైబ్ అందిస్తుంది. అత్యంత సంక్లిష్టమైన అంశాలను కూడా సులభంగా అర్థం చేసుకోవడానికి, నేర్చుకోవడానికి మరింత ఆకర్షణీయంగా ఉండేలా రూపొందించబడిన ప్రసిద్ధ లీనమయ్యే త్రీడీ వివరణాత్మక వీడియోల భారీ కలెక్షన్ నుండి విద్యార్థులు ప్రయోజనం పొందుతారు.

## ఫిబ్రవరి 1న ఉచిత ఎముకల పటుత్వ పరీక్షలు.

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి ఒకటవ తేదీన అవనిగడ్డలు జండు ఫార్మా ఆధ్వర్యంలో ఉచిత ఎముకల పటుత్వ పరీక్షలు గాలిగోపురం వద్ద గల శ్రీ ధన్వంతరి ఆయుర్వేద చికిత్స ఆలయంలో ఉచిత పరీక్షలు నిర్వహిస్తారని డాక్టర్ పాంచ్ జన్య కుమార్ బుధవారం విలేకరులకు చెప్పారు. ఎముకల నొప్పులు, కీళ్ల నొప్పులు, సయాటికా లక్షణాలు కలిగి ఉన్న వారిని పరీక్ష చేస్తారని ఆయన చెప్పారు. 100 సంవత్సరాల అనుభవం కలిగిన జండు ఫార్మా వారి సహకారంతో ఉచితంగా ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా కేవలం 2000 రూపాయల విలువ కలిగిన పరీక్షలు మాత్రమే ఉచితంగా నిర్వహిస్తారని మందులు ఉచితంగా అందజేస్తారని అన్నారు.



## క్రీస్తు సువార్త మహాసభలో ఎమ్మెల్యే

**పామర్రు జనవరి 29 మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు కళ్యాణ మండపంలో జరిగిన క్రీస్తు సువార్త మహాసభలో పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజాను నిర్వాహకులు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కుమార్ రాజా క్రీస్తు సందేశాన్ని హాజరైన ప్రజలకు అందజేశారు.

## స్కిల్ హబ్ లో ఉచిత శిక్షణా తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం




**గన్నవరం, జనవరి 29, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా గన్నవరం లోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ పద్మావతి తెలిపారు. గన్నవరం పాలిటెక్నిక్ కళాశాల లోని స్కిల్ హబ్ లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు పై ఉచిత శిక్షణ ఇస్తామని, వచ్చే నెల 4 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి అని, నూతన సాంకేతికతను ఉపయోగించి, నిపుణుల ద్వారా శిక్షణ ఇచ్చి స్థానికంగా ఉన్నటువంటి పరిశ్రమలలో ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. కావున జిల్లా లోని ఆసక్తి ఉన్నటువంటి యువతీయువకులు ఈ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ కోర్సుకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతి యువకులు అర్హులనీ, ఆసక్తి గల అభ్యర్థులు, పూర్తి వివరాలకు 9494005725, 8885159008 నెంబర్ లను సంప్రదించి తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. పద్మావతి సూచించారు.

## నందిగామ తహసిల్దార్‌కు రెడ్ క్రాస్ సంఘం సత్కారం



**నందిగామ, జనవరి 29, మేజర్ న్యూస్:** 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ తహసిల్దారుగా ఎంపికై జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు ప్రశంసాపత్రం అందుకున్న నందిగామ తహసిల్దార్ అభినందనీయులని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నందిగామ సబ్ బ్రాంచ్ సభ్యులు తెలిపారుబుధవారం నాడు వారి కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ పారేపల్లి సాయిబాబు మాట్లాడుతూ రెవిన్యూలో తహసిల్దారుగా వృత్తి పట్ల నైపుణ్యం, అంకితభావంతో పనిచేసి వివిధ పనుల మీద కార్యాలయానికి వచ్చు పేద- మధ్యతరగతి కుటుంబాల వారికి త్వరితగతిన పనులు చేస్తున్న తహసిల్దార్ కు మంచి అధికారిగా ఈ ప్రాంతంలో పేరు తెచ్చుకున్నందుకు అభినందనలు తెలిపారు.కార్యాలయ సిబ్బందితో ఎప్పటికప్పుడు మమేకమై, అందరితో కలివిడిగా పనిచేస్తున్న అధికారి సురేష్ బాబు అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి పటావంచల రామారావు, కోశాధికారి గంటా విజయకుమార్, ఆర్ఐ: వేణుకుమారి తదితరులు పాల్గొన్నారు.

## బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ పర్యటన




**గుంటూరు మేజర్ న్యూస్ :** బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ ఇప్పటి వరకు తమ అత్యంత గొప్ప ఎడిషన్‌ను విడుదల చేసింది. ఫ్యాషన్ కేవలం ప్రారంభం మాత్రమే అయిన 'ద వన్ అండ్ వోన్లీ' ప్రపంచాన్ని సృష్టిస్తుంది. ఈ టూర్ యొక్క 2025 ఎడిషన్ అసాధారణమైనదిగా మారిన ఆధునికమైన అవతారాన్ని విడుదల చేస్తుంది. అంతర్జాతీయ ఫ్యాషన్, మ్యూజిక్, స్వప్నమైన ఆశ్చర్యాన్ని ప్రేరేపించే వినోదంలో గొప్ప ప్రదర్శనలు తెస్తోంది. ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో మరోసారి చేతులు కలిపిన ఫ్యాషన్ టూర్ తమ అందమైన, ప్రలోభపరిచే సారాంశాన్ని అత్యంత ప్రసిద్ధి చెందిన స్టైల్ దిగ్గజాలతో కలిసి సంబరం చేస్తోంది.

# మనిషి జీవితంలో విద్యార్థి దశ ఎంతో ముఖ్యమైనది

### గన్నవరం సీఐ బి.వి శివ ప్రసాద్



**గన్నవరం, జనవరి 29, మేజర్ న్యూస్ :** విద్యార్థులు జీవితంలో అనుకున్నది సాధించాలంటే డ్రగ్స్‌కి, చెడు అలవాట్లకి దూరంగా ఉండాలని గన్నవరం సీఐ బి.వి శివప్రసాద్ అన్నారు. బుధవారం గన్నవరం మండలం కేసరపల్లి వేములపల్లి కోదండ రామయ్య కళాశాలలో గన్నవరం పోలీస్ సర్కిల్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. శివప్రసాద్ మాట్లాడుతూ.. మనిషి జీవితంలో విద్యార్థి దశ ఎంతో ముఖ్యమైనదని, ఈ దశలో మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం సర్వ నాశనం అవుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ అమ్మినా, వినియోగించినా చట్టరీత్యా నేరమని అందుకు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని చెప్పారు. డ్రగ్స్ విక్రయించే వారి దృష్టి కళాశాలలోని పిల్లలపై పడిందని, వారిని టార్గెట్ చేసుకుని డ్రగ్స్‌కి అలవాటు చేసి డబ్బు సంపాదిస్తున్న వ్యక్తులు ఉన్నారని, వారి యెడల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మీపై తల్లిదండ్రులు ఆధారపడి ఉంటారన్న విషయాన్ని మరువకూడదు అని అన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా మాయలో పడిపోకూడదన్నారు. ఫోన్ వినియోగం ఎంత తగ్గించుకుంటే అంత మంచిదన్నారు. తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, ఒక పాప ఇంటర్మీడియట్ చదువుతుందని, ఇప్పటికీ ఆమెకు ఫోన్ కొని ఇవ్వలేదన్నారు. అందువల్ల తాను చదువులో నెంబర్ వన్ గా ఉందని గర్వంగా చెప్పారు. స్మార్ట్ ఫోన్‌లను అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని, మిగతా సమయంలో ఫోన్ లేని జీవితం గడపాలని పిల్లలకు సూచించారు. ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, స్మార్ట్ ఫోన్ ఉపయోగించే వ్యక్తులను టార్గెట్ చేసుకుని కేటుగాళ్లు సైబర్ మోసాలు చేస్తున్నారని చెప్పారు. బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును దర్జాగా మాయం చేస్తున్నారని, వాటికి సంబంధించిన కేసుల వివరాలు తెలియజేశారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రభుత్వం, చట్టం పటిష్ట చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఏదేమైనా నేరాలు ఆగాలంటే మనుషుల ప్రవర్తనలో, అలవాట్లలో మార్పులు రావాలన్నారు. విద్యార్థులకు ఏదైనా సమస్య వస్తే పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాలలో సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకుందాం



**పామర్రు జనవరి 29 మేజర్ న్యూస్ :** గ్రామాలలో ఉన్న సమస్యలను నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించుకుందామని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పమిడిముక్కల మండలంలోని కపిలేశ్వరపురం గ్రామంలో మండల పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను కార్యకర్తలు, నాయకులు తన దృష్టికి తీసుకురావడం ద్వారా వారందరి సమిష్టి నిర్ణయంతో ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిద్దామన్నారు. ముందుగా ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఇప్పటికే కోటికి పైగా దాటిందని, పామర్రు నియోజకవర్గం పూర్తిస్థాయిలో సభ్యత్వ నమోదును పూర్తి చేయలేదన్నారు. కావున మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా మండలంలో సభ్యత్వ నమోదు తీరును గ్రామాల వారీగా ఆయన కార్యకర్తలు, నాయకులతో విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కొల్లిపర బాబి, లింగంమనేని బాబురావు, జక్కా శ్రీనివాసరావు, కొల్లిపర వెంకటేశ్వరరావు, చిగురుపాటి జగదీష్, మైనేని ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుండే రహదారి భద్రత నియమాలు తెలుసుకోవాలి



**నందిగామ, జనవరి 29, మేజర్ న్యూస్:** జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం నందిగామ మండలము లోని ప్రభుత్వ జడ్పీహెచ్ స్కూల్, అనసాగరం విలేజ్, నందిగామ ( మం), కాకతీయ అపోలో స్కూల్, నందిగామ లోని స్కూల్ విద్యార్థులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించామని యం.పద్మావతి తెలిపారు. ఈ సంధర్బంగా ఆర్టీవో యం.పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులకు రహదారి భద్రతపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందచేశామని తెలిపారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, ట్రాఫిక్ పోలీసులను గౌరవిస్తూ, వివేచనతో వాహనాలను వినియోగించడం మన కర్తవ్యం. కాబట్టి జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటడం, బస్సు ఆగినప్పుడు మాత్రమే ఎక్కడం, దిగడం చేస్తానని తెలుపుతున్నాను. ప్రాణం ఎంతో విలువైనది. హెల్మెట్ సీటు బెల్ట్ లేకుండా మితిమీరిన వేగంతో, నిర్లక్ష్యంతో, అవగాహన రాహిత్యంతో వాహనాలు నడపడం ప్రమాదం అని, దిద్దుకోలేని తప్పు చేసినవారం అవుతామని గ్రహిస్తున్నాను.రహదారులు నీడనిచ్చే చెట్లతో మెరిసిపోవాలి తప్ప రక్తపు మరకలతో తడిసిపోకూడదని విజ్ఞతతో వ్యవహరిస్తానని ఆత్మసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను " అని ప్రతిజ్ఞ చేయించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నందిగామ ప్రాంతీయ రవాణా శాఖాధికారి యం.పద్మావతి, మోటార్ వాహన తనిఖీ అధికారి యం. పూర్ణిమ, పరిపాలన అధికారి బి . ఎస్ కె ప్రభాకర లింగం, ప్రభుత్వ జడ్.పి.హెచ్ స్కూల్ హెడ్ మాస్టర్ సిహెచ్ శ్రీనివాస రావు, కాకతీయ అపోలో స్కూల్ ప్రిన్సిపల్ కె.రవీంద్ర, అన్నపూర్ణ డ్రైవింగ్ స్కూల్ సీనియర్ ఇన్స్ ట్రక్టర్ సిహెచ్ రామరావు, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## అవార్డు గ్రహీతలకు సన్మానం

**గన్నవరం, జనవరి 30, మేజర్ న్యూస్ :** జిల్లా ఉపాధి కల్పన ఉత్తమ అధికారిగా రెండోసారి అవార్డు పొందిన దేవరపల్లి విక్టర్ బాబు, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులుగా ఉత్తమ అవార్డు పొందిన ఎలీషా దేవ సహాయం లను ఎంఎఫ్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. విభిన్న రంగాల్లో వారిద్దరూ చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి జిల్లాస్థాయిలో అవార్డులు ఇవ్వడం శుభ పరిణామం అని ఎం.ఇ.ఎఫ్ గన్నవరం నియోజకవర్గ అధ్యక్షులు దేవరపల్లి ఏసుబాబు అన్నారు. ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు సమాజ సేవలకు పునరంకితం అయిన వారికే అవార్డులు వరిస్తాయని పేర్కొన్నారు. విక్టర్ బాబు, ఎలిషాలు మరెన్నో అవార్డులు తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ మందా వేణుబాబు, మండల ఇన్చార్జి కోటా కృష్ణ మోహన్, తిరివీధి కృష్ణ బాబు, పులపాక ఏసురత్నం పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యతను క్రమ తప్పకుండా పరిశీలించాలి






**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగర పరిధిలో గల ఉన్న అన్ని అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యతను నోడల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు క్రమ తప్పకుండా పరిశీలించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్, హెచ్ బి కాలనీ ప్రాంతాలని పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్, హెచ్ బి కాలనీ లోగల అన్న క్యాంటీన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు, ఆహార నాణ్యతలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, అన్న క్యాంటీన్లో అవసరమైన సదుపాయాల్లో ఎటువంటి మరమ్మతులు ఉన్న ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, కిచెన్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేటట్టు చూసుకోవాలని, నిరంతరాయంగా త్రాగునీటి ఉండాలని, వాడుక నీటి పైపైన్లలో ఎటువంటి లీకేజీ లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి. వి. జి. ఎస్. వి. ప్రసాద్, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ (వర్క్స్ )పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 30 కల్లా ఇళ్ళ రిజిస్ట్రేషన్ చేయించుకోండి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్:** నగరపాలక సంస్థ వారు జారీ చేసిన పట్టాలను గజం కేవలం రూ.100లకే రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు జనవరి 30 ఆఖరితేదని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. పాయకాపురం, కొత్త రాజరాజేశ్వరి పేట ప్రాంతాలలో విజయవాడ నగరపాలక సంస్థ వారు కేటాయించిన పట్టాలను గజం 100 రూపాయలకే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్లో జరుగుతుందని, ఇంకా ఇళ్ళ రిజిస్ట్రేషన్లు ఎవరివైతే చేయించుకోవాలో జనవరి 30 తేదీ కల్లా ఇంటి రిజిస్ట్రేషన్ చేయించుకోగలరని, ప్రభుత్వం వారు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు.

## కొండ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల క్షేమం ఎంతో ముఖ్యం

### విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** కొంత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల క్షేమం ఎంతో ముఖ్యమైనదని అన్నారు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా మొగల్రాజపురం, క్రీస్తు రాజపురం, చిట్టినగర్, ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగర పరిధిలో ఉన్న కొండ ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు నివసిస్తున్న కొండ ప్రాంతాల్లో గల కొండలను జియాలజిస్టులతో ప్రత్యేకమైన పరీక్షలు చేయించి వాటి నివేదికలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి చిట్టినగర్ లోగల స్వరంగం ను పరిశీలించారు, స్వరంగం నుండి కారుతున్న నీటి సమస్యను అరికట్టే విధంగా ప్రణాళికను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ (వర్క్స్ )పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



## వాసవి మాత త్యాగనిరతి స్ఫూర్తిదాయకం

### ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** వాసవి మాత త్యాగనిరతి, ఆత్మాభిమానం స్ఫూర్తిదాయకం అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అవనిగడ్డ విభాగం వారి నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించారు. చల్లపల్లి శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపం పెద్దలు ఈ నెల 31న చల్లపల్లి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో నిర్వహించే అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరికీ తలవంచని తత్వంతో వాసవి మాత ఆర్యవైశ్యులకు ఆరాధ్య దేవతగా అవతరించింది న్నారు.వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవటం ద్వారా వాసవి మాత త్యాగానికి తగిన గుర్తింపు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అవనిగడ్డ విభాగం అధ్యక్షులు కొల్లిపర రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు విస్సంశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి కోడూరు పవన్ కుమార్, బెజవాడ ధన సురేష్, దేసు శేషగిరి రావు, చల్లపల్లి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కళ్యాణ మండపం అధ్యక్షులు కొల్లిపర మధు, సభ్యులు వరదా హరగోపాల్, తమ్మన సతీష్ కుమార్, కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘ రాజకీయ కమిటీ చైర్మన్ జల్లూరి ప్రసాద్, ఉరిమి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వేటూరి దివిసీమ వాసి కావటం గర్వకారణం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** సుప్రసిద్ధ తెలుగు సినీ పాటల రచయిత స్వర్గీయ వేటూరి సుందర రామమూర్తి దివిసీమ వాసి కావటం గర్వకారణం అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక గాంధీక్షేత్రంలో వేటూరి సుందర రామమూర్తి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలి బుద్ధ ప్రసాద్ వేటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు సినీ పాటల స్థాయిని పెంచే ఎన్నో అద్భుతమైన గీతాలు వేటూరి కలం నుంచి జాలువారాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, కూటమి నాయకులు మండలి రామ్మోహనరావు, కోట సాయికృష్ణ, యలవర్తి చిన్నా, శోభిల ఏడుకొండలు, మేడికొండ విజయ్, గరికపాటి హరి, మెరుగు సోమిరెడ్డి, కొల్లూరి వాసు, ముళ్ళపూడి శ్రీనివాసరావు, దామెర్ల సతీష్, కొండవీటి పాండురంగారావు, గుడివాక మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

## తమ ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ



**పామర్రు జనవరి 29 మేజర్ న్యూస్ :** తమ కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ కలిగిందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు 36 లక్షల రూపాయలతో నిర్మించిన ఏడు సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్రామీణ ప్రాంతాలలో రోడ్లను అభివృద్ధిపరిచేందుకు నిధులను మంజూరు చేస్తోందన్నారు. రానున్న కాలంలో ప్రతి గ్రామంలోనూ నూరు శాతం రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కొల్లిపర బాబి, లింగంమనేని బాబురావు, జక్కా శ్రీనివాసరావు, కొల్లిపర వెంకటేశ్వరరావు, చిగురుపాటి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి




**పామర్రు జనవరి 29 మేజర్ న్యూస్ :** పశుసంవర్ధక శాఖ ద్వారా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను రైతులు, పాడిపశువుల యజమానులు సద్వినియోగపరచుకోవాలని పశు వైద్యాధికారులు విజ్ఞప్తి చేశారు. పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు సంబంధించి గర్భకోశ వ్యాధులు, గాలికుంటు వ్యాధుల కు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన పశువులకు శస్త్రచికిత్సలు చేశారు. అలాగే పశువులకు నట్టల నివారణ మందులు అందించారు. గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడంతో పాటు కోళ్లు, ఇతర పక్షులకు, చిన్న జంతువులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అవసరమైన వాటికి మందులు అందించడంతో పాటు యజమానులకు తగు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్లు డా. పద్మ, డా. సిహెచ్.శ్రీనివాసరావు, పామర్రు సహాయ సంచాలకులు డా.సిహెచ్.శశి కుమార్, విజయవాడ సహాయ సంచాలకులు డా. సృజని, కపిలేశ్వరపురం, కృష్ణాపురం పశు వైద్యాధికారులు డా.వెంకటేష్, డా.ఎన్. ఈశ్వర్, డా.కె.రామనరేష్, పశుసంవర్ధక శాఖకు చెందిన పలువురు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతికి ఉన్నతమైన కృషి




**పెడన మేజర్ న్యూస్ :** ప్రేమాంజలి సామాజిక సేవా కేంద్రం ద్వారా ఇప్పటికే వివిధ పెడన పట్టణం, గ్రామాల్లో టైలరింగ్ శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న 8 మంది మహిళలకు ప్రేమాంజలి సామాజిక సేవా కేంద్రం ద్వారా కుట్టుమిషన్ లు ఉచితంగా అందించామని ఆ సంస్థ కోఆర్డినేటర్ సిస్టర్ తెలిపారు. ఈ మేరకు సిస్టర్ హెలెన్ తమ కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందించారు. ఈ సందర్భంగా సిస్టర్ హెలెన్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రేమాంజలి సామాజిక సేవా కేంద్రం ద్వారా మహిళలకు 70 కుట్టు మిషన్లను మహిళలకు ఉచితంగా అందించామన్నారు.ఇది మహిళల కుటుంబాలకు గొప్ప ఆసరాగా ఉందని చెబుతూ, ప్రేమాంజలి సామాజిక సేవా కేంద్రం ఆశయంలో భాగంగా స్త్రీ స్వతంత్రంగా ఉండాలని, వారి కుటుంబాలకు మద్దతుగా ఉండాలని, వారు ఎదుగుతున్న విధంగా ఇతరులకు విద్యను అందించాలని తెలిపారు. ఒక మార్గం ఉన్నచోట ఒక సంకల్పం ఉంటుంది. కాబట్టి అందరూ సాధికారత కోసం కష్టపడాలి అని ప్రేమాంజలి సామాజిక సేవ కేంద్రం కోఆర్డినేటర్ సిస్టర్ హెలెన్ అన్నారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్ శిక్షణ ముగించిన మహిళలు సేవ కేంద్రం సిబ్బంది ఉన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలు అందించాలి





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో (పి హెచ్ సి) మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వైద్య అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పీ హెచ్ సీ లలో వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పన, సమస్యలపై బుధవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్ లోని తన ఛాంబర్లో వైద్య ఆరోగ్య, రహదారులు భవనాలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యాధికారులు జిల్లాలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి మెరుగైన వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. పీహెచ్సీలలో అధిక మొత్తంలో డెలివరీలు జరిగేలా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో బయోమెడికల్ వ్యర్థాల సేకరణకు రంగు కవర్లు కలిగిన చెత్త బుట్టల ఏర్పాటుపై ఆయన వైద్య అధికారులను ఆరా తీశారు. క్రమం తప్పకుండా వాటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బంటుమిల్లి పీహెచ్సీ భవనం పాడైపోయి పైకప్పు పెచ్చులూడుతోందని, ఉన్న భవనం సైతం ఇరుకుగా ఉందని, దానిని ఆధునీకరించి విస్తరించాల్సిన అవసరం ఉందని డిఎంహెచ్వో కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అంచనాలు తయారుచేసి నివేదిక సమర్పించాలన్నారు. పామర్రు నియోజకవర్గంలోని గరికపర్రులో వైద్య సేవల నిమిత్తం ఒక దాత (ఎన్నారై) భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారని, దానిని సద్వినియోగం చేసుకునేలా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి ప్రహరీ గోడ (కాంపౌండ్ వాల్), సమావేశ మందిరం నిర్మించాల్సిన అవసరం ఉందని డి ఎం అండ్ హెచ్ ఓ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అందుబాటులో గల నిధులను ఉపయోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. అర్హత గల వైద్యులకు నిపుణులైన గైనకాలజిస్టులతో డెలివరీలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ డెలివరీలపై ఇప్పటికే శిక్షణ పొందిన పలువురి వైద్యుల అభిప్రాయాలను ఫోన్లో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేష్, ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రేమ్ చంద్, డీసీఓ డాక్టర్ సతీష్, ప్రోగ్రాం ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ ధర్మకర్త గోపాలకృష్ణ మృతి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక సంత మార్కెట్ వద్ద కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల ఆలయ ధర్మకర్త రాజనాల గోపాలకృష్ణ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. గురు భవానీ పిలుచుకునే గోపాలకృష్ణ కొంతకాలంగా అనారోగ్యానికి గురై మృతి చెందారు. గోపాలకృష్ణ మృతదేహాన్ని పలువురు ప్రజా ప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు సందర్శించి నివాళులు అర్పించారు .ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కోసం కోరుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతి చెందిన గోపాలకృష్ణకు భార్య ఇద్దరు కుమారులు. ఒక కుమార్తె కాగా ముగ్గురికి వివాహాలు అయ్యాయి.

## నేడే విద్యార్థులకు ప్రతిభ పాటవ పోటీలు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మహాత్మా గాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకొని గాంధీ క్షేత్రంలో విద్యార్థులకు గురువారం ప్రతిభ పాటవ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి లోపు విద్యార్థులకు జూనియర్స్ విభాగంలో వ్యాసరచన, స్వాతంత్ర సమరంలో గాంధీజీ పాత్ర,దేశభక్తి గేయాలు, గాంధీజీ పాటలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ పైన విద్యార్థులకు సీనియర్స్ విభాగంలో వ్యాసరచన, గాంధీజీ సిద్ధాంతాలు, నేటి సమాజానికి వాటి ఆవశ్యకత, దేశభక్తి గేయాలు ఏవి అయినా పాడవచ్చని చెప్పారు పోటీలలో పాల్గొనేవారు నియోజకవర్గ స్థాయిలో పోటీ నిర్వహించడం జరుగుతుందని వ్యాసరచన సమయం ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి 10 గంటల 30 నిమిషాల వరకు,పాటల పోటీల సమయం 10 గంటల 30 నిమిషాల నుండి 11 గంటల 30 నిమిషాల వరకు జరుగుతాయని వ్యాసరచన కు ప్రతి పాఠశాల, కళాశాల నుండి ఐదుగురు మించకుండా పాల్గొనాలని పాటల పోటీలకు ముగ్గురు విద్యార్థులు మాత్రమే అనుమతిని వ్యాసరచనలు తెలుగులోనే రాయాలని ఇంగ్లీషులో రాసిన వాటిని పరిగణలోకి తీసుకోమని అన్నారు. వ్యాసరచనకు తెల్ల కాగితాలు నిర్వాహకులే అందిస్తారని పోటీలు ప్రారంభానికి 30 నిమిషాల ముందుగా వారి వారి పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు పోటీల అనంతరం జరిగే గాంధీజీ వర్ధంతి సభలో శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా ప్రోత్సాహ బహుమతులు అందించడం జరుగుతుందని అన్నారు. మరిన్ని వివరాలకు 9949417719ను సంప్రదించాలని అన్నారు.

## కమిషనర్ ఈవీ రమణ బాబుకు సత్కారం



**నందిగామ, జనవరి 29, మేజర్ న్యూస్:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర టీడీపీ తెలుగు రైతు అధికార ప్రతినిధి అమ్మినేని జ్వాల ప్రసాద్ కమిషనర్ రమణబాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జ్వాలా ప్రసాదు మాట్లాడుతూ 76వ గణతంత్ర దినోత్సవం లో కలెక్టర్ లక్ష్మీసా చేతుల మీదుగా అవార్డును ప్రశ్నించపత్రాన్ని అందుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. నందిగామ పట్టణంలో ప్రతిరోజు ఉదయాన్నే పారిశుద్ధ్య అంతర్గత రోడ్ల అభివృద్ధి ప్రజలు తాగునీటి సమస్య లేకుండా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల్ని పరిష్కరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నందిగామ ప్రభుత్వ హాస్పటల్ అభివృద్ధి చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు కమిషనర్‌కు ఉత్తమ అవార్డు వచ్చినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు నాయకులు పాల్గొన్నారు.

## కోళ్లకు టీకాలు వేయడంతో ఆకస్మిక మరణాలు తగ్గించొచ్చు : విస్తరణ శాస్త్రవేత్త బి నవీన్




**ఘంటసాల, మేజర్ న్యూస్:** ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో మహిళా రైతులకు పెరటి కోళ్ల పెంపకంపై ఆరు రోజుల నైపుణ్యత శిక్షణా కార్యక్రమములో భాగంగా 3 వ రోజు కోడి పిల్లలలో చేపట్టవలసిన మేత యాజమాన్య పద్ధతులు, టీకా (వ్యాక్సిన్) లు ఎప్పుడు వేసుకోవాలి, వాడే విధానం, టీకాలు వేయడం ద్వారా అకస్మాత్తుగా వచ్చే మరణాల రేటు తగ్గించవచ్చు అని విస్తరణ శాస్త్రవేత్త డా : బి. నవీన్ తెలియజేశారు. అలాగే, కోళ్ల పెంపకంలో పాటించవలసిన జీవ భద్రత చర్యలు గురించి గృహ విజ్ఞాన శాస్త్రవేత్త, జి. కృష్ణవేణి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కె. వి కె శాస్త్రవేత్తలు మహిళా రైతులు పాల్గొన్నారు.



### సబ్ జోన్ "సాఫ్ట్-బాల్" పోటీలలో

## గోగినేనిపాలెం విద్యార్థుల ప్రథమ స్థానం

**ఘంటసాల, మేజర్ న్యూస్:** 84వ గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీలు 23,24,25 తేదీల్లో అవనిగడ్డ నియోజకవర్గం లోని తలగడదీవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించగా, ఈ పోటీలలో గోగినేనిపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలురుకు సంబంధించి "సాఫ్ట్-బాల్" సీనియర్స్ విభాగం, జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి పాఠశాల హవాను కొనసాగించారు. 4,5, 6 తేదీల్లో గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్లో జరిగే జిల్లాస్థాయి సెంట్రల్ జోన్ ఆటోల పోటీలలో పాల్గొంటారు. జడ్పీ హైస్కూల్లో జరిగిన అభినందన సభ కార్యక్రమంలో గ్రామపెద్ద పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అత్తలూరు గోపీచంద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావులు మాట్లాడుతూ ప్రథమ స్థానంలో గెలుపొందిన విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గరికపాటి మారుతికి శుభాకాంక్షలు తెలియజేసి, అభినందించారు. సెంట్రల్ జోన్ ఆటోల పోటీలలో ప్రథమ స్థానంలో గెలుపొంది పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కొడాలి, తాడేపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



**ఘంటసాల, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కొడాలి తాడేపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి కే మురళీకృష్ణ పేర్కొన్నారు. మొవ్వ ఏ డి ఏ కె.శ్యామల మాట్లాడుతూ ప్రస్తుతం మినుము పొలాల్లో, పల్లాకు ఉధృతి ఎక్కువగా కనిపిస్తుందని, పసుపుపచ్చని మొక్కలు కనిపించిన వెంటనే పీకివేసి పిప్రోనిల్ 400 మి.లీటర్లు, ఎసిటామప్రిడ్ 40 మిల్లి గ్రాములు ఏదో ఒక దానిని పిచికాలి చేసుకోవాలన్నారు. వైరస్ కారణంగా దోమల వేగంగా తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయని, యాజమాన్య పద్ధతులు పాటించాలని, పంటకు సకాలంలో తగు యాజమాన్య పద్ధతులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. మినుము పంట 45 రోజులు (విత్తిన నాటి నుండి) కలుపు కనిపించిన ఎడల వెంటనే 2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి చొప్పున బంగారుతీగ కలుపు మొక్కపై మాత్రమే పడేలా చల్లుకోవాలి. తద్వారం ఉధృతి తగ్గించుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో కొడాలి ఉప సర్పంచ్ తుమ్మల శంకరవు, వి. ఏ. ఏ. లు వెంకటలక్ష్మి, అలీ, రైతులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నియామకం




**నందిగామ, జనవరి 29, మేజర్ న్యూస్:** వీరులపాడు మండ లం వెల్లంకి గ్రామంలో జెడ్పిహెచ్ ఉన్నత పాఠశాలలో పనిచే యుచున్న బిఎస్ పాల్‌ని డెమోక్రటిక్ పి ఆర్‌టియు నాయకత్వంలో ఎన్టీఆర్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రాష్ట్ర అధ్యక్షులు డి.శ్రీను చేతుల మీదుగా నియమించారు. డి పి ఆర్ టి యు రాష్ట్ర నా యకులు డి శ్రీను, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.సుందర్‌రావు పాఠశాల ప్రధా నోపాధ్యాయులు విజయ లక్ష్మి సమక్షంలో ఎన్నుకున్నారు.. పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.

## సీఎం, డిప్యూటీ సీఎంకు ధన్యవాదములు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈనెల 31వ తేదీన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం అధికారికంగా నిర్వహించుటకు ఆదేశాలిచ్చిన మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కూటమి నాయకులకు కన్యకా పరమేశ్వరి దేవస్థానం పాలకవర్గ చైర్మన్ మామిడి మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, సహాయ కార్యదర్శి బైసాని హయగ్రీవరావు, కారుమూరి రాజేంద్రప్రసాద్ ధన్యవాదాలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ నగరంలోని అన్ని వైశ్య సంస్థలు హర్షం వ్యక్తం చేశాయని తెలిపారు. కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఉదయం అమ్మవారికి తైలాభ్యంగనము, విశేష అభిషేకాలు,కుంకుమార్చన, నీరాజన మంత్ర పుష్పాలు, వాసవి హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం సహస్రనామ పుష్పార్చన,మహిళల జ్యోతుల మధ్య నగరవీధులలో వీధులలో అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. నగర ప్రజలు యావన్మంది ఈ కార్యక్రమాలలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## రహదారి భద్రతకు ప్రతి వాహనదారుడు ప్రాధాన్యతనివ్వాలి : డి.ఎస్.పి ధీరజ్ వినీల్

**గుడివాడ, మేజర్ న్యూస్:** రోడ్డు భద్రత నిబంధనను అతిక్రమించడం, అతివేగంగా వాహనాలు నడపడమే ప్రమాదాలకి కారణమని గుడివాడ డి.ఎస్.పి వి.ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. ది లారీ ఓనర్స్ అండ్ ట్రాన్స్ పోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు– 2025 కార్యక్రమంలో గుడివాడ డిఎస్పీతో పాటు పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రహదారి భద్రతపై ఆటోనగర్ నుండి లారీ స్టాండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీ నిర్వహించారు. లారీ స్టాండ్ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో డిఎస్పి వినీల్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడుకి వేగంగా గమ్యస్థానానికి చేరుకోవాలని లక్ష్యాన్ని కంటే, భద్రతే ముఖ్యం కావాలన్నారు. ముఖ్యంగా వాహనదారులు ఎప్పటికప్పుడు తమ వాహనాల కండిషన్ పరీక్షించుకుంటూ ఉండాలని డిఎస్పి సూచించారు. లారీ యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# గత ముఖ్యమంత్రి విలాసాలు జల్సాలకు వేల కోట్ల రూపాయల దుబారా



## ఎమ్మెల్యే కుమార్ రాజా

**పామర్రు జనవరి 29 మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి విలాసాలు, జల్సాలకు వేల కోట్ల రూపాయలు దుబారా చేశారని పామర్రు శాసనస భ్యుడు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. బుధవారం పామర్రు లోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 19,801 కోట్ల రూపాయల అప్పులు చేసిందన్నారు. రేషన్ బియ్యం, సెంటు పట్టాల భూములు, సచివాలయాలకు రంగులు వేయడం, తీయడం వంటి కార్యక్రమాలకు వేలాది కోట్ల రూపాయల దుబారా ఖర్చు చేసిందన్నారు. అంతేగాక తన ప్యాలెస్ భద్రత కోసం 986 మంది భద్రతా సిబ్బందిని వినియోగించారని పేర్కొన్నారు. సర్వే రాళ్ల పైన, పట్టాదారు పాసుపుస్తకాల పైన తన ఫోటోలను ముద్దించుకునేందుకు, సాక్షి పత్రికలో ప్రకటనల కోసం కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును ప్రభుత్వం దారాదత్తం చేసిందన్నారు. రిషికొండలో విలాస భవన నిర్మాణానికి ప్రభుత్వ ధనాన్ని వెచ్చించారని, తాడేపల్లి ప్యాలెస్ ముందు రోడ్డు వేయడానికి ఐదు కోట్ల రూపాయలు, ప్రజాధనాన్ని అలాగే ప్యాలస్ ఫెన్సింగ్ వేసేందుకు పది కోట్ల రూపాయలను దుబారా చేశారని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల కాలంలో ముఖ్యమంత్రి నివాస భవనంలో పెన్నులు పేపర్ల కోసమే కోట్ల రూపాయలు, పఫ్ ల ఖర్చు దాదాపు నాలుగు కోట్ల రూపాయలు ప్రభుత్వ సొమ్మును చెల్లించారని పేర్కొన్నారు. ఆయన కుటుంబం వ్యక్తిగత ప్రయాణాలకు దాదాపు 23 కోట్ల రూపాయలను ఖర్చు పెట్టారని పేర్కొన్నారు. మద్యం దుకాణాలలో ఎలుకలు పట్టేందుకు కోట్లాది రూపాయలను ఖర్చు చేశారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం మంచి ప్రభుత్వమని అహర్నిశలు రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కష్టపడుతున్నారని పేర్కొన్నారు. 8 లక్షల28 వేల కోట్ల రూపాయల అప్పులు తీర్చేందుకు బాధ్యతగా ముఖ్యమంత్రి తో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ లు కృషి చేస్తున్నారన్నారు. ఒకవైపు అప్పులు చెల్లించుకుంటూ మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పయనింపచేసేందుకు వారు పడుతున్న కష్టానికి ప్రజలు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు భరోసా, నమ్మకాన్ని ఇచ్చేందుకే వారు కష్టపడుతున్నారనే విషయాన్ని ప్రజలు గమనించి ఆశీస్సులు అందించాలన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరు గమనించాలని ఆయన కోరారు. గత ప్రభుత్వంలో చేసిన అప్పులు, వారి జల్సాలు, విలాసాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశానని కుమార్ రాజా పేర్కొన్నారు.

## ప్రభుత్వ విప్ సౌమ్యను కలిసిన ఇంజనీర్ మొహిద్దిన్



**నందిగామ, జనవరి 29, మేజర్ న్యూస్:** నియోజక వర్గ శాసన సభ్యులు తంగిరాల సౌమ్య ని నందిగామ లో వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా నాగార్జున సాగర్ ఎడమ కాలువ విస్సన్న పేట సర్కిల్ సూపర్ఇండెంట్ ఇంజినీర్ యం ఆర్ మొహిద్దీన్ కలిశారు. ఈ సందర్భంగా శాసన సభ్యురాలు సౌమ్య యస్ యీ గతో వేదాద్రి – కంచల ఎత్తి పోతల పథకానికి తక్షణం నిధులు మంజూరు చేయించాలి అని, జోన్ 3 పరిధిలో ఉన్న కంచికచర్ల ,వీరుల పాడు మండలాలకు వెంటనే సాగర్ జలాలు అందించడానికి చర్యలు చేపట్టాలి అని, అన్ని కాలువల మరమ్మత్తులకు,కంపపూడు తొలగించడానికి ఎస్టిమెట్లు వేసి నిధులు రాబట్టాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, యన్ యస్ పి నందిగామ డి ఈ సుబ్బారావు, కంచికచర్ల యన్ యస్ పి డి ఈ శ్రీవాత్సవ, నందిగామ, కంచిక చెర్ల ఏ ఈ లు పాల్గొన్నారు.

## గుడివాడ అగ్నిమాపక శాఖాధికారికి ఘన సన్మానం



**గుడివాడ, మేజర్ న్యూస్:** జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ పనితీరుకు అవార్డు అందుకున్న అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి ఆంజనేయులుని సామాజిక కార్యకర్త మాచర్ల రామకృష్ణ, అగ్నిమాపక సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణ అగ్నిమాపక సభ్యులు,ఆర్కే వారియర్స్ పాల్గొన్నారు.

## దేవాలయాల్లో హుండీ దొంగల అరెస్టు



**గుడివాడ మేజర్ న్యూస్:** దేవాలయాల్లో హుండీ దొంగలను గ్రామీణ పోలీసులు అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపర్చారు. గుడివాడ తాలూకు ఎస్ఐ ఎన్. చంటి బాబుకు వచ్చిన సమాచారం మేరకు అయన తన సిబ్బందితో గుడివాడ రూరల్ మండలం బిల్లపాడు గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడిలో జరిగిన హుండీ దొంగతనం ముద్దాయిలను గంగాధరపురం గ్రామంలో అరెస్టు చేసారు. బొడ్డు వెంకట్రావ్ ఇంటి వద్ద అతనిని, కత్తుల కోటేశ్వరరావు అను వ్యక్తిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి హుండీలో డోగిలించిన రూ. 5200, ఒక స్పేయర్ను స్వాధీనపరచు కొన్నారు. హుండీ దొంగలను గుడివాడ ఏజేఎఫ్సీఎం కోర్టు మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా ఇద్దరు ముద్దాయిలకి 14 రోజుల రిమాండ్ విధించింది, ముద్దాయిలను మచిలీపట్నం జైలుకు పంపమని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తాలుక పోలీసులు తెలిపారు.

## కాలభైరవ స్వామిని ఆరాధిస్తే సకల గండాలు తొలిగిపోతాయి



**అమరావతి మేజర్ న్యూస్ :** కాలభైరవ స్వామిని ఆరాధిస్తే సకల గండాలు ప్రమాదాలు, అపమృత్యు దోషాలు తొలగిపోతాయని ఆధ్యాత్మిక సేవకులు శ్రీ ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు, నిజాంపేట్ శ్రీ భ్రమరాంబా సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయం ప్రధాన అర్చకులు శ్రీధరమల్లె గౌతమ్ కుమార్ చెప్పారు. ఈరోజు " మౌని అమావాస్య" సందర్భంగా సాయంత్రం ప్రదోషకాలం సమయంలో శ్రీ కాలభైరవ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు గండ దీపాలు వెలిగించారు. పెద్ద ఎత్తున భక్తులు కాలభైరవ స్వామికి పూజలు నిర్వహించారు. ఇదే సందర్భంలో రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. కాలభైరవ స్వామి దగ్గర గుమ్మడి కాయలలో దీపాలు వెలిగించారు. ఆలయ ధర్మకర్త శ్రీ ఏనుగుల కృష్ణా రెడ్డి, సినిమా నిర్మాత శ్రీ ముప్పు భిక్షపతి పలువురు మహిళలు పాల్గొన్నారు.



## విజయ వనమలమ్మ విగ్రహ పున :ప్రతిష్ట

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక నిజాంపేటలో విన్నకోట బాలకోటయ్య తోటలో నూతనంగా అత్యంత శోభాయమానంగా పూర్తి రాతి కట్టడంతో నిర్మించబడిన, శ్రీ కళ్యాణ సుందరేశ్వర సమేత శ్రీ విజయ వనమలమ్మ అమ్మ వారి విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన శుభ పత్రిక కరపత్రాన్ని, భక్త బృందం, ఆలయ పాలకమండలి ఆవిష్కరించారు. ఈనెల 31వ తేదీ నుండి నాలుగు రోజుల పాటు అత్యంత వైభవంగా వనమలమ్మ అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవం ఆలయ నిర్వహకులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఫిబ్రవరి మూడవ తేదీ శ్రీ కళ్యాణ సుందరేశ్వర సమేత విజయ వనమలమ్మ అమ్మ వారి విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవం త్రయాహినిక దీక్షతో బ్రహ్మశ్రీ రాళ్ల పల్లి ఆంజనేయ శాస్త్రి బ్రహ్మత్వమున నిర్వహించడం జరుగుతుందని, భక్తులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని, ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పశు వైద్య శిబి రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువులకు వ్యాధులు వ్యాపించకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ అన్నారు. బుధవారం కానూరు పంచాయితీలో గల వన్నారు హైస్కూల్, గణపాబత్తుల కానూరు రైతు భరోసా కేంద్రంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. సదరు శిబిరానికి గోపు సత్యనారాయణ, జనసేన నాయకులు దివి మహేష్ అతిథిలుగా విచ్చేసి పాల్గొని, పశు వైద్య శిబిరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో 50 దూడలకు నట్టల నివారణ మందు, 100 గేదెలకు డీవార్మింగ్, 4 కృత్రిమ గర్భధారణలు,30 తీరుబొల్లు, 25 సామాన్య పశువులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో పశువైద్య డాక్టర్ దీపక్ డానియెల్, ఎస్ వి వి రామారావు, ఎం.వీరబాబు, గ్లోరి,రంజిత,ఈశ్వరమ్మ, శ్రీనివాసరావు,గోపాలమిత్ర రాఘవ, పీత రాము, బొమ్మిడి పెద ఏడుకొండలు,గోపు వెంకటరమణ,ఈవన ప్రభాకరరావు,చిటికనేటి సీతారామయ్య, బసవరావు పాల్గొన్నారు

## 25 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో న్యాయమే గెలిచింది

### గుర్రం నాగయ్య



**విజయవాడ, మేజర్ న్యూస్ :** నందిగామ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారు కోర్టులో సంచలనాత్మకమైన తీర్పు ఇచ్చారని గుర్రం నాగయ్య పేర్కొన్నారు. బుధవారం గవర్నర్ పేటలో ఒక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 25 సంవత్సరాలు పోరాటంలో విజయాన్ని సాధించానని న్యాయమే గెలిచిందని గుర్రం నాగయ్య చెప్పారు. గతంలో గుర్రం నాగయ్య ఆటో ఫైనాన్స్ నిర్వహించేవాడని, తన సోదరుడు గుర్రం వెంకటసుబ్బయ్యకు తన ఫైనాన్స్ బాధ్యతలు అప్పజెప్పినని అన్నారు. నా ఫైనాన్స్ కంపెనీలో అవకతవకలు జరుగుతున్నాయని గుర్రం వెంకటసుబ్బయ్యను ప్రశ్నించన్నారు. అంతా ఫైనాన్స్ కంపెనీ నష్టంలో ఉందని గుర్రం వెంకటసుబ్బయ్య చెప్పి మోసం చేసినట్లు గుర్తించారు. నేను ఇచ్చిన ట్రాక్టర్ ఫైనాన్స్ నందిగామ రుద్రవరానికి సంబంధించిన హనుమంతరావు ట్రాక్టర్ ఓనర్ బకాయిలు బయటకు తీశాను అన్నారు. గతంలో హనుమంతరావు ట్రాక్టర్ను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. నా సంతకాలు ఫోర్జరీ చేసి గుర్రం వెంకటసుబ్బయ్య సీజ్ చేసిన ట్రాక్టర్ను విడుదల చేసి అమ్మేసుకున్నారు. 2000 సంవత్సరంలో ప్రైవేట్ కేసును వేశాను అన్నారు. వాదనలు విన్న జడ్జి మంగళవారం అంతిమ తీర్పు ఇచ్చారన్నారు. ఇరువురికి ఆరు నెలల జైలు శిక్ష 2000 రూపాయలు విధించినట్లు జడ్జి తీర్పునిచ్చారు. 25 ఏళ్లు సుదీర్ఘ పోరాటంలో న్యాయం గెలిచిందన్నారు.

# దాతల ఆశయాలకు అనుగుణంగా ధార్మిక సంస్థలు సేవలు అందించాలి



**గుడివాడ, మేజర్ న్యూస్:** మంచి లక్ష్యంతో దాతలు ఏర్పాటుచేసిన ధార్మిక సంస్థలు వారి ఆకాంక్షలకు అనుగుణంగా సేవలు అందించాలని గుడివాడ కూటమి నేతలు పేర్కొన్నారు. గుడివాడ పట్టణం మార్కెట్ సెంటర్ వద్ద గల దేవాదాయ ధర్మాదాయ సంస్థకు చెందిన శ్రీ ఘంటసాల నాగభూషణం వైశ్య అన్నదాన సత్రం ఆధ్వర్యంలో పేద వైశ్య విద్యార్థులకు ప్రోత్సాహక స్కాలర్షిప్ ల పంపిణీ, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ప్రసవించనున్న గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార నిమిత్తం నగదు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, సీనియర్ టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహన్రావు,ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు యక్కలి మణిదీప్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్, దేవాదాయ శాఖ అధికారులు 55 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి 2వేల చొప్పున స్కాలర్షిప్ లను, ప్రభుత్వ హాస్పిటల్లో ప్రసవించనున్న 200 మంది గర్భిణీలకు ఒక్కొక్కరికి 1000 రూపాయలు చొప్పున పోషకాహార నిమిత్తం నగదును అందజేశారు. దాతల లక్ష్యాలకు అనుగుణంగానే దార్మిక సంస్థల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నామని దేవాదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ డివిజన్ దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారి ఉయ్యూరు సుధాకర్, దేవాదాయ శాఖ అధికారులు కందుల గోపాలరావు, యార్లగడ్డ వాసు, గంగు శిరీష, శ్రీ విగ్నేశ్వర స్వామి వారి దేవస్థాన కమిటీ చైర్మన్ సాయన రాజేష్, జనసేన నాయకులు వేమూరీ త్రినాథ్, పట్టణ వైశ్య సంఘాల పెద్దలు జవ్వాజి గంగరాజు, కొత్త వీరయ్య, కూరేళ్ళ శ్యామ్, దోస పాటీ హరిప్రసాద్, పలువురు దేవాదాయ శాఖ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# నీట్, జేఈఈల్లో ఉత్తమ ర్యాంక్‌ల కోసం ఆకాష్ 'ఎయిమ్'





**విజయవాడ, మేజర్ న్యూస్ :** దేశంలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో మెడిసిన్, ఇంజినీరింగ్ సీట్ల సాధన కోసం అత్యుత్తమ ర్యాంకుల సాధనే లక్ష్యంగా ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్) సంస్థ ఎయిమ్ ఫర్ ఎక్సలెన్స్ (ఏఐఎం) పేరుతో సరికొత్త ప్రోగ్రామ్‌కు రూపకల్పన చేసింది. విజయవాడలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆకాష్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్‌వీఎస్ నరేష్ ఈ ప్రోగ్రామ్ వివరాలు వెల్లడిరచారు. స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఎయిమ్ ప్రోగ్రామ్ కోసం ప్రత్యేకంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక ఫీజులు వసూలు చేయబోమని తెలిపారు. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు దేశవ్యాప్తంగా ఏకీకృత సిలబస్ ప్రకారం అత్యుత్తమ బోధనను, మెటీరియల్‌ను అందిస్తామని వివరించారు. దేశంలోని ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్, ఐఐటీలు, ఎన్ఐటీల్లో ఎక్కువ మంది విద్యార్థులు సీట్లు సాధించేలా దిశా నిర్దేశం చేయడం, ఆ దిశగా అన్ని వనరులను సమకూర్చి పరీక్షకు సన్నద్ధం చేయడమే ఎయిమ్ అంతిమ లక్ష్యమని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఆకాష్ ఈ ప్రోగ్రామ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని, విజయవాడతోపాటు గుంటూరులోని తమ క్యాంపస్‌లలో ఈ సదుపాయం ఉంటుందని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. స్క్రీనింగ్ టెస్ట్‌తోపాటు మరిన్ని పూర్తి వివరాల కోసం విజయవాడ, గుంటూరులలో ఉన్న తమ క్యాంపస్‌లను సంప్రదించాలని సూచించారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ మహేంద్ర, ఏరియా ఆపరేషన్ హెడ్ అర్జున్, అకడమిక్ హెడ్ మెడికల్, దినేష్, జితేంద్ర, అకడమిక్ హెడ్ ఇంజినీర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటాం

### టీటీపీ యువ నాయకులు గద్దె క్రాంతికుమార్





**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటూ, నిరంతరం తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ అన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త గాదం ప్రసాద్ బాబు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో బుధవారం ఉదయం టీడీపీ యువ నాయకులు 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ గులాబీ రోడ్డులో గాదం ప్రసాద్ ఇంటికి వెళ్ళి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మీకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. గాదం ప్రసాద్ కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని గద్దె క్రాంతికుమార్ అందజేశారు. గద్దె క్రాంతికుమార్ తో పాటు జనసేన నాయకులు గాదిరెడ్డి అమ్ములు ఉన్నారు.

# జీవిత ప్రతిబింబం నాటకం



**విజయవాడ, మేజర్ న్యూస్ :** తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్ర నాటక కళా సమితి, కొడాలి బ్రదర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై జరుగుతున్న నందమూరి తారక రామారావు కళాపరిషత్ వారి 8వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవములు బుధవారంతో ముగిశాయి. జానపద నృత్య కళాకారులు కొమారిపాటి ఏసు వెంకట ప్రసాద్ కు ఘన సత్కారం జరిగింది. వేదికపై తపస్వి కల్చరల్ ఆర్ట్స్ అధ్యక్షుడు వేముల హాజరత్తయ్య గుప్త, కార్యదర్శి సూర్యదేవర జగన్నాధరావు, సభాధ్యక్షులుగా నన్నపనేని నాగేశ్వరరావు, ముఖ్యఅతిథిగా గుమ్మడి గోపాలకృష్ణ, గౌరవ, ఆత్మీయ అతిథులుగా రాకేష్, డాక్టర్ బి జయప్రకాష్, జవ్వాజి నారాయణ ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ సమాజంలోని అన్ని తరగతుల మానవ జీవన విధానానికి దర్పణం నాటకం అని, సమకాలీన కథ వస్తువులతో సామాజిక స్పృహని కలిగించే నాటకాలు స్ఫూర్తిదాయకాలని, నిద్రాణమై ఉన్న జాతిని మేలుకొలిపేదే నాటకమని అన్నారు.



అధ్యక్షుడు హాజరత్తయ్య గుప్తా అతిథులను కళాకారులను సత్కరించి, సహకరించిన వారందరికీ, ముఖ్యంగా జయప్రదం చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపి భవిష్యత్తులో మరిన్ని అంశాలను ప్రేక్షకులకు అందజేస్తామని తెలిపారు. అదే వేదికపై ప్రథమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి సమర్పణలో స్నిగ్ధ నాటకీకరణ చేయగా ఎన్ రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించిన "ఇది అతని సంతకం ," నాటిక ప్రదర్శితమైంది. నటీనటులుగా రవీంద్ర రెడ్డి, విసిహెచ్ కె ప్రసాద్, సూర్య, శ్రీలేఖ, కుసుమసాయి లు వ్యక్తి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జీవించాలని, మనిషికి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ఉంటుందని, మధ్యలో ఎన్నో సమస్యలు అడ్డంకులు ఎదురవుతాయని వాటితో రాజీ పడితే వ్యక్తిత్వం చచ్చిపోతుందని, వేసే ప్రతి అడుగు జాగరూకతతో వేయాలని జీవిత చరమాంకంలో ప్రశాంతతకు కొదవ లేకుండా జీవించాలనే ఇతివృత్తంతో గంగోత్రి పెద కాకాని వారి "పేగు రాసిన శాసనం " కు దర్శకత్వం నాయుడు గోపి వహించగా ,రచన చింతకింది శ్రీనివాస రావు సమకూర్చారు.



### జంతు సంక్షేమం

# మనందరి బాధ్యత

### జంతు హింస నివారణ చట్టంపై అవగాహన ముఖ్యం

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్‌టీఆర్ జిల్లా, జనవరి 29, మేజర్ న్యూస్ :** జంతు సంక్షేమం అనేది మనందరి బాధ్యత అని.. జిల్లాలో జంతు సంరక్షణలో స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. జంతు సంక్షేమ పక్షోత్సవాలు (జనవరి 14-30) సందర్భంగా జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు గ్రామ, మండల స్థాయిలో క్విజ్, వక్తృత్వ, వ్యాస రచన అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బుధవారం జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించగా, విజేతలకు కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లో సర్టిఫికేట్లు, బహుమతులు అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జంతు హింస నివారణ చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, జంతు సంరక్షణ ప్రాధాన్యతను గుర్తెరిగి మసలుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక అధికారి డా. ఎం.హనుమంతరావు, డిప్యూటీ డైరెక్టర్ డా. మోసెస్ వెస్లీ, ఏడీ డా. వి.కృష్ణమూర్తి, సమగ్రశిక్ష ఏఎంవో ఎస్.అశోక్ బాబు, సెంట్రల్ ఎంఈవో విజయరామారావు తదితరులు పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999

